క్లుప్తంగా

విధుల్లో చేరిన ‘గూడెం’ కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ కమిషనర్‌గా శుక్రవారం శేషాంజనేయస్వామి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపాలిటీ కమిషనర్ల బదిలీలో భాగంగా కొత్తగూడెం వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

సుజాతనగర్ ఎస్‌ఐ...


జుబేదా బేగం

సుజాతనగర్: సుజాతనగర్ ఎస్‌ఐగా జుబేదా బేగం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ ఎం.సోమేశ్వర్లు ఇల్లెందు కొమురారం బదిలీ అయ్యారు. రామవరం పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ జుబేదా బేగం సుజాతనగర్‌కు బదిలీపై వచ్చారు.

ఎస్పీని కలిసిన ఎస్‌ఐ


ఎస్పీ రోహిత్‌రాజ్‌కు మొక్క అందజేస్తున్న టేకులపల్లి ఎస్‌ఐ రహూఫ్

టేకులపల్లి: ఇల్లెందులో ఎస్‌ఐగా పని చేసిన షేక్ సైదా రహూఫ్ టేకులపల్లి ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయిన విషయం తెలిసిందే. టేకులపల్లిలో ఇటీవల ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

జెడ్పీ సీఈఓను కలిసిన పీఆర్ అధికారులు

చుంచుపల్లి: జిల్లాకు బదిలీపై వచ్చి కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ ఎస్.ప్రసూనరాణిని శుక్రవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జెడ్పీ సీఈఓను కలిసిన వారిలో పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ సత్యనారాయణ, ఏఓ కోటయ్య,ఏఈ నాగేందర్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి


డెయిరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: గ్రామాలలో పారిశుద్ధ్యం మరింతగా మెరుగుపర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వీధులలో పేరుకుపోయిన చెత్తను క్రమం తప్పకుండా తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను, నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న విజయ పాల డెయిరీని సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి రజినీకాంత్ పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు


బేతంపూడిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీందర్‌రావు

టేకులపల్లి: గ్రామ పంచాయతీల్లో నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం టేకులపల్లి మండలంలోని రోళ్లపాడు, తొమ్మిదో మైల్ తండా, బేతంపూడి, గోల్యా తండా గ్రామ పంచాయతీలలో తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను ఆయన పరిశీలించారు. ప్రతీ నర్సరీలో అన్ని విత్తనాలు మొలకెత్తే విధంగా పెంచాలని, ప్రతీరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పెట్టాలని, కలుపు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మీగణేష్ గాంధీ, అదనపు కార్యక్రమ అధికారి కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు శిరీష, కృష్ణకుమారి, మీనా కుమారి, ప్రశాంత్, మరియు సాంకేతిక సహాయకులు చంద్మాల్, సురేష్, క్షేత్ర సహాయకులు భద్రం, భద్రయ్య సరిత పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం

- ప్రశాంతంగా ముగిసిన సమ్మె
- పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు
- బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపు




ఇల్లెందు: సార్వత్రిక సమ్మెలో వామపక్ష, కార్మిక సంఘాల నేతలు

కొత్తగూడెంటౌన్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలో బంద్ ప్రశాంతంగా జరిగింది. వ్యాపార సముదాయాలు, సినిమా హాల్స్, టిఫిన్ సెంటర్లు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు, విద్యా సంస్థలు తెరుచుకోకపోడంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమ్మెకు మద్దతుగా ర్యాలీల్లో పాల్గొన్నారు. సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉంటుందని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ తెలిపారు. రావిలాల రామారావు, దుంద్ర రమేష్, పిట్టల రామారావు పాల్గొన్నారు.

పాల్వంచ: కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపి ప్రభుత్వాన్ని సాగనంపాలని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పలు పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, టీడీపీ, న్యూడెమోక్రసీ, ప్రజా పంథా, టీజేఎస్ పార్టీలు, అనుబంధ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, పద్మజ, దొడ్డా రవికుమార్, రాందాస్, జలీల్ పాషా తదితరులు పాల్గొన్నారు.


జూలూరుపాడు: నిలిచిపోయిన ఆటోలు


పాల్వంచ: అంబేద్కర్ సెంటర్ వద్ద...


పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద నిర్మానుష్యంగా భద్రాచలం జాతీయ రహదారి

పాల్వంచరూరల్: బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం నిర్వహించిన భారత్ బంద్ పాల్వంచ మండలంలో ప్రభావం చూపింది. నిత్యం రద్దీగా ఉండే బీసీఎం నిర్మానుష్యంగా మారింది.

జూలూరుపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం జరిగిన దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. అఖిలపక్ష పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తోరోకో నిర్వహించారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కె నాగుల్‌మీరా, యాసా నరేష్, బానోత్ ధర్మా తదితరులు పాల్గొన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో భారత్ బంద్ పాటించారు. జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. పూనెం ఝాన్సీ, యాసా నరేష్, వల్లమల చందర్‌రావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సుజాతనగర్: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం సుజాతనగర్‌లో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని అయిలయ్య, సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, అఖిల పక్షం నాయకులు చింతాల శ్రీను బంద్‌లో పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజా, రైతు, ఉద్యోగ, కార్మిక, వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలను ఉధృతం చేస్తామని వామపక్ష, విపక్షాల నేతలు అన్నారు. శుక్రవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం అయింది. ఎస్‌కే సాబీర్ పాషా, అన్నవరకు కనకయ్య, జలీల్ పాష, కెచ్చెర్ల రంగ్య, కందగట్ల సురెందర్, ఎల్.విశ్వనాథం, ముద్దా భిక్షం, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశవ్యాపిత బంద్‌లో భాగంగా విద్యుత్ జిల్లా సర్కిల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, 327 యూనియన్, 1104 యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.


కొత్తగూడెంటౌన్: సూపర్‌బజార్ సెంటర్‌లో తెరుచుకోని వ్యాపార సముదాయాలు


ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

ఇల్లెందు: సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన దేశవ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్ విజయవంతం అయిందని ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏపూరి బ్రహ్మం, దొడ్డా దానియేల్, జడ సీతారామయ్య, తాళ్లూరి కృష్ణ అన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఇల్లెందురూరల్: శుక్రవారం గ్రామీణ బంద్ ప్రశాంతంగా సాగింది. వ్యాపారులు, కార్మికులు బంద్‌కు పూర్తిస్థాయిలో సహకరించారు. పలు కార్మిక సంఘాలు, విప్లవ పార్టీల ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు.

టేకులపల్లి: భారత్ బంద్ శుక్రవారం టేకులపల్లి మండలంలో ప్రశాంతంగా జరిగింది. సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ, రైతు సంఘాల నాయకులు, టిప్పర్ డ్రైవర్లు, వివిధ రంగా కార్మికులు ఎర్ర జండాలు పట్టుకుని మండల కేంద్రంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు టేకులపల్లి సెంటర్ నుంచి తహసీల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు.


టేకులపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు


సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరసన తెలుపుతున్న కార్మికులు, ఉద్యోగులు



సుజాతనగర్: సమ్మె చేస్తున్న నాయకులు

28 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు

టేకులపల్లి: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 14 వరకు జరుగుతాయని టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొదటి సంవత్సరం 157, ద్వితీయ 121 మొత్తం 278 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అర్ధగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని పేర్కొన్నారు. ప్యాడ్, పెన్నులు, స్కేలు, హాల్ టికెట్ తప్పనిసరిగా తెచ్చుకోవాలని, సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని సూచించారు.

లేక్‌వ్యూ పార్క్ పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల లేక్‌వ్యూ పార్క్‌ను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. రెండేళ్లుగా పార్క్ పనులు సాగుతున్నాయి. నూతన ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించాలని నిర్ణయించి తుది దశ పనులు ముమ్మరం చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలతో కొంత సమయం గడిపేందుకు లేక్ వ్యూ పార్క్‌ను చిల్డ్రన్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్నట్లు చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే ప్రారంభం అవుతుందని, అందుకు తగ్గట్టుగా పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఇల్లెందురూరల్: లచ్చగూడెం గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. అఖిలభారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజ చేశారు. ఆలయ నిర్మాణానికి యాదవ సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కుంజ కృష్ణ, మాడె సునిత, బొగ్గారపు సంగయ్య, యుగంధర్, గుంటి కృష్ణ, ఆవుల చంద్రయ్య, సంజీవరెడ్డి, వెంకటేశ్వర్లు, సిద్ధూనాయక్, చుంచు వెంకటేశ్వర్లు, ప్రతాప్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు సాధించాలి


విద్యార్థినులకు నిత్యావసరాలు అందిస్తున్న సూర్యనారాయణ, కరుణామయి దంపతులు

పాల్వంచ: విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని కేటీపీఎస్ ఏడీఈ సూర్యనారాయణ, ములకలపల్లి వ్యవసాయధికారిణి కరుణామయి అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు నిత్యావసర వస్తువులను సూర్యనారాయణ, కరుణామయి దంపతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం అనేక రకాలుగా వసతులు అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకుని ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు అందిస్తున్న చొరవ అమూల్యమైందన్నారు. కార్యక్రమంలో ములకలపల్లి, పాల్వంచ మండలాల గణాంకాధికారి ఎం.వెంకటేశ్వర్లు, కస్తూర్బా గాంధీ విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ తులసి, పీఈటీ మాధవి, అధ్యాపకులు యశోద, తరంగణి, కుమారి, రంజిత, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల రక్షణకు చట్టం చేయాలి


మాట్లాడుతున్న కిరణ్

ఇల్లెందురూరల్: వ్యవసాయ కార్మికుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర రాష్ట్ర కన్వీనర్ పద్మ, మండల కార్యదర్శి అలేటి కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ దేవులపల్లి యాకయ్యనగర్‌లో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. వ్యవసాయ కార్మికులైన పేదలు నిరుపయోగ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే సింగరేణి, రెవెన్యూ, అటవీశాఖల అధికారులు నోటీసులు ఇస్తూ బెదిరింపులకు పాల్పడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. నిధుల కేటాయింపు పెంచడంతోపాటు రోజువారీ కూలీని పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం చేయాలని కోరారు. రేపాకుల శ్రీనివాస్, నబి, జైబున్నీసా, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, అబ్బాస్, రాము, వీరభద్రం, నీలారాణి, మంగ, పద్మ పాల్గొన్నారు.

కోర్టులో హాజరుపర్చండి




సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న నాయకులు, టేకులపల్లిలో మాట్లాడుతున్న ఊక్లా నాయక్

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ రాష్ట్ర నాయకుడు అశోక్, రాష్ట్ర నాయకులు గోపన్న, పుల్లన్న, మదార్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు వెంటనే కోర్టులో హాజరుపర్చాలని, ఆపార్టీ నాయకులు ఎల్.విశ్వనాథం, కందగట్ల సురెందర్ డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14న బయ్యారం ప్రాంతంలో సీపీఐ(ఎంఎల్) నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారి ప్రాణాలకు ఎలాంటి హాని తలపెట్టకుండా, వెంటనే వారందరినీ కోర్టుకు హాజరు పరచాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గాని నాగేశ్వరరావు, మోత్కూరి మల్లికార్జున్‌రావు, కుంజా కృష్ణ, రామ్మూర్తి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: అరెస్ట్ చేసిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, వరంగల్ జిల్లా కార్యదర్శి గోపన్న, పుల్లన్న తదితర నాయకులను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రెండు వర్గాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో నాయకులు బానోతు ఊక్లా నాయక్, కల్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఈనెల 14న సాయంత్రం ఖమ్మం నుంచి వస్తున్న అశోక్, గోపన్నలను పోలీసులు అరెస్ట్ చేశారని, వారితో పాటు నాయకులు మదార్, సురేష్‌లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారని, కానీ ఇంతవరకు అరెస్ట్ చూపించ లేదని విమర్శించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న పుల్లన్న, జోగా రణధీర్, భాస్కర్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. భూక్యా హర్యా, నెల్లూరి నాగేశ్వరావు, నోముల భానుచందర్, నర్సింగ్, రామస్వామి, కోటిలింగం, సజ్జన్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలాజీనగర్ ప్రజలు

ఇల్లెందురూరల్: అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీకి చెందిన ప్రజలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దాస్యం ప్రమోద్ మాట్లాడుతూ.. బాలాజీనగర్‌లో అనేక మంది పేదలు సొంతిల్లు లేక అద్దె ఇళ్లల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను పేదలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాములు, ఘాజీ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్‌ఐ రహూఫ్

టేకులపల్లి: యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని టేకులపల్లి ఎస్‌ఐ షేక్ సైదా రహూఫ్ అన్నారు. ఈ మేరకు టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న మైదానంలో జరుగుతున్న కేపీఎల్ సీజన్1 క్రికెట్ టోర్నమెంట్‌ను సందర్శించారు. క్రీడాకారులతో కలిసి బ్యాటింగ్ చేసి సందడి చేశారు. మాట్లాడుతూ... యువత భవిష్యత్‌పై దృష్టి సారించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక వృద్ధికి, ఆరోగ్యానికి, స్నేహభావం పెంపొందించేందుకు ఉపయోగపడతాయన్నారు. ఇటీవల అనేక చోట్ల జల్సాలకు, తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే అత్యాశలకు లోనై, దొంగతనాలు, గంజాయి క్రయవిక్రయాలకు పాల్పడుతూ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నట్లు చెప్పారు. చక్కగా చదువుకోవాలని, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, క్రీడల్లో, పోటీ పరీక్షల్లో రాణించి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బోడ మంగీలాల్ నాయక్, మూడు గణేష్ చౌహాన్, కత్తుల అఖిల్, భూక్యా ఈశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఎంపీ టికెట్ కేటాయించండి


వేంనరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: మహబూబాబాద్ ఎంపీ టికెట్‌ను ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(ఏజేఏసీ) డిమాండ్ చేసింది. శుక్రవారం జేఏసీ చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ ఆధ్వర్యంలో చలోగాంధీ భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణలో రాబోవు ఎంపీ ఎన్నికల్లో మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీ సీట్లు ఆదివాసీలకు కేటాయించాలని కాంగ్రెస్‌ను కోరారు. ఈసారి కాంగ్రెస్ నుంచి ఎట్టి వెంకన్నకు టికెట్ ఇస్తే తామంతా మద్దతుగా పనిచేసి గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గొగ్గెల రామస్వామి, పడిగ నాగేశ్వరరావు, బొల్లి సారయ్య పాల్గొన్నారు.

ఘనంగా సమ్మక్క, సారలమ్మ జాతర

- వేలాదిగా భక్తుల పూజలు
- వనదేవతలకు మొక్కులు చెల్లింపు




శ్రీసమ్మక్క గద్దె వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు, శ్రీసారలమ్మకు మొక్కులు చెల్లిస్తున్న భక్తజనం

జూలూరుపాడు: మండలంలో పడమటనర్సాపురం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర శుక్రవారం మూడో రోజుకు చేరింది. భక్తులు వందలాది సంఖ్యలో తరలిరావడంతో కోలాహలంగా మారింది. పరిసర మండలాలు సుజాతనగర్, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, వైరా, కామేపల్లి, కారేపల్లి మండలాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తును తరలివచ్చారు. వనదేవతలు శ్రీ సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మలను దర్శించుకొని పులకించి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. భక్తులు కోరిన కోర్కెలను తీర్చిన వనదేవతలకు బోనాలు, నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) చెల్లించగా, మరికొందరు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమ్మక్క, సారలమ్మ దేవతల గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తల్లుల నామాన్ని స్మరిస్తూ పసుపు, కుంకుమ, పూలను చల్లడంతోపాటు, గాజులు, కోడి గుడ్లు గద్దెలపై పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలను బలిహరణ ఇచ్చి భక్తిని చాటుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి భోజనాలు చేశారు.

జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పలురకాల దుకాణాలలోని వస్తువులు, దేవతల పూజా సామాగ్రి, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం), పిల్లల ఆట వస్తువులు, దేవతామూర్తుల చిత్రపటాలు, మిఠాయిల దుకాణాల వద్ద పిల్లలు, మహిళలు బారులు తీరారు. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో కంటే సాయంత్రం సమయంలో వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వచ్చారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ జీవన్‌రాజు ఆధ్వర్యంలో విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శనివారం నాలుగో రోజు వనదేవతలు వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

వనదేవతలు ఆరాధ్య దైవాలు..



శ్రీసమ్మక్క–సారలమ్మ వనదేవతలను ఆరాధ్యదైవాలుగా పూజిస్తాం. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే జాతరను ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో జరుపుకుంటాం. వనదేవతలను దర్శించుకుంటే అంతా మేలు జరుగుతుంది.

– ముక్తి జానకి, భక్తురాలు, పడమటనర్సాపురం

పదేళ్లుగా జాతరకు వస్తున్నాం..



పదేళ్లగా వనదేవతలను కుటుంబ సభ్యులందరం దర్శించుకుంటున్నాం. శ్రీసమ్మక్క, సారలమ్మ దేవతలను మనస్సులో కోరుకున్న కోర్కెలను తీర్చింది. వనదేవతలను దర్శించుకున్న నాటి నుంచి అంతా మంచే జరిగింది.

– గోళ్ల నాగమణి, భక్తురాలు, వైరా మండలం

కోరిన కోర్కెలు తీర్చే దేవతలు..



కోరిన కోర్కెన తీర్చిన వనదేవతలు సమ్మక్క, సారక్క. తన కొడుకు, కోడలికి ఇద్దరు అమ్మాయిలు. మగ సంతానం కోసం మొక్కుకుంటే తీర్చారు. ఆనాటి నుంచి ప్రతీ జాతరకు కుటుంబమంతా కలిసి వచ్చి తల్లులను దర్శించుకుంటున్నాం.

– రాచబంటి పున్నమ్మ, భక్తురాలు, కాకర్ల

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148